
ఆదర్శం కోసం
పోలిశెట్టి ఓబయ్య

'బుద్బుద ప్రాయమైన జీవితానికి అర్థం కల్పించేది ఆదర్శం' అని ఎన్నోసార్లు క్లాసులో చెప్పాను.

కొందరు విద్యార్థులు అసలు వినరు. మరి కొందరు విని మర్చిపోతారు. కానీ శారద అలాంటిది కాదు.

క్లాసులో చెప్పిన ప్రతి మాటనీ ఆచరించి చూసేది.

అనంత కాలప్రవాహంలో నే జేసిన ఇరవై ఏళ్ళ ఉపాధ్యాయ వృత్తిలో ఎందరో శిష్యులు, శిష్యురాండ్రు.

కానీ శారద శిష్యురాలేకాదు. ఆ వూర్లో కాపరం పెట్టినప్పటి నుండి నీడలా మా వెంట వుంటూ మా బాగోగులు పట్టించుకొనే ఆత్మ బంధువు. మా ఆవిడ శారదను స్వంత కూతురులా చూసేది. నాకూ అంతే.

స్కూలు ఫైనల్ ప్యాసై ఇంటర్‌లో గెంతి బి.ఏ.లో ప్రవేశించినా శారద మునుపటిలా మా ఇంటికి వస్తూండేది.

మా ఆవిడతో ఇంటి పనులు, వంట పనులు చర్చించి మా అమ్మాయి కమలకో కథ చెప్పందే శారద వాళ్ళింటికి వెళ్ళేది కాదు.

ఆ రోజు సాయంకాలం. వారపత్రిక తిరగేస్తున్న నేను తలెత్తి చూశాను.

ఎదురుగా శారద, ఆమె కళ్ళల్లో కన్నీళ్ళు.

'ఏమ్మా శారదా, చదువుకొన్నదానివి. సమస్య లుంటే సావకాశంగా పరిష్కరించుకోవాలిగానీ ఇలా కన్నీళ్లు పెట్టుకోగూడదు. ఇంతకూ నీకు వచ్చిన కష్టమేమిటి' అడిగాను.

'ప్రస్తుతము నా ముందర నిల్చొన్న సమస్యకు పరిష్కారం కన్పడ్డంలేదు మాష్టారూ. మా నాన్నగారు నన్ను ఫారెన్ రిటర్న్‌డ్ డాక్టరుకిచ్చి, పెళ్ళి చేస్తానంటున్నాడు. రేపే అబ్బాయి నన్ను చూడ్డానికి వస్తున్నాడు. అసలు నాకు పెళ్ళంటే ఇష్టంలేదు. పెళ్ళి చేసుకొని పిల్లలని కనడమేనా స్త్రీ జీవిత పరమార్థం. నా కాళ్ళమీద నేను నిలబడాలి. సంఘంలో గుర్తింపు తెచ్చుకోవాలి. గొప్ప రచయిత్రిగా పేరు తెచ్చుకోవాలి. సంఘసేవ చెయ్యాలి. ఎలాగైనా మా నాన్నగారికి నచ్చజెప్పి నాకీపెళ్ళి జరక్కుండా చూడండి'' అంటూ శారద వెక్కివెక్కి ఏడ్చింది.

నేను ఇన్నేళ్ళ భార్యాపిల్లలతో సంసారం చేసినా రాని అనుభవాన్ని నూరుపాళ్ళూ వూహించి చెప్తున్న శారదను చూసి నేను అవాక్కయిపోయాను.

శారద ఇంటికెళ్ళింది. ఆమె మాటలు నా చెవుల్లో గింగురుమన్నాయి. ఆవేళ రాత్రే శారద ఇంటికెళ్ళాను.

ఉజ్జ్వల భవిష్యత్తుండే శారదకు అప్పుడే పెళ్ళి చేయద్దనీ ఆవిడ నాన్నగారికి నచ్చజెప్పాను. శారద నాన్న ఒప్పుకొన్నారు. పంతుళ్ళు తమ మాట నెగ్గించుకోవడంలో పరమ నేర్పరులు కదా. ఆమెకు మహోపకారం చేసినవాడిలా తెగ మురిసిపోయాను.

* * *

శారద చదువు సాఫీగా సాగింది. ఎం.ఏ. లో ఫస్టు క్లాసు తెచ్చుకొని స్థానిక కాలేజీలో లెక్చరరయింది ఆవిడ బాధ్యతలు పెరిగాయి. దాంతో మా ఇంటికి ఆవిడ రాకపోకలు తగ్గాయి.

కాలచక్రంలో ఐదేళ్ళు గిరుక్కుమన్నాయి. చాలా కాలం పిమ్మట శారద మా ఇంటికొచ్చింది. మా ఆవిడ చాలా సంతోషపడింది. శారదకు ఇంకా పెళ్ళి కాలేదని నా కదోలావుంది. అయినా నోరుతెరచి ఆమెను అడగలేకపోయాను. ఎంత సన్నిహితమైనా పెరిగిన ఆమె వయస్సు ఆమెకూ నాకూ మధ్య కనుపించని అడ్డుగోడలేవో నిర్మించింది.

నన్ను పదహారణాలూ అర్థం చేసుకొన్న మా శ్రీమతి నా మనసులోనిమాట అందుకొంది.

'శారదా ! నీ పెళ్ళి విషయం ఎందాకావచ్చింది ?

'ఎక్కడేసిన గొంగడి అక్కడేవుంది అమ్మయ్య గారూ' అంది శారద. నోరు విప్పడానికి నాకు కాస్త దారి దొరికింది.

'ఇంకా ఆలస్యంచేసి లాభంలేదమ్మా, ఏ వయసులో జరగాల్సిన ముద్దూముచ్చట ఆ వయసులో జరిగితేనే బావుంటుంది ఆదర్శాలు చెప్పకోడానికే తప్ప ఆచరించడానికి పనికిరావు. ఆదర్శాల బరువు పెరిగేదే కాని తరగదు. కాలప్రవాహానికి ఆదర్శాల ఇసుక మేటలు విరిగి కరిగిపోతాయి. నిన్ను పెళ్ళి చేసుకొంటానన్న డాక్టరు అమెరికాలో హాయిగా పిల్లా పాపలతో కాపురం చేస్తున్నాడు. పెళ్ళి ఒక సాంఘిక నియమం. అది ఓ బస్సులాంటిది. ఒకప్పుడు నీ అంతట నువ్వు ఆ బస్సును వదిలేస్తే, మరొకప్పుడది నువ్వు అందుకోవాలన్నా అందకుండా స్టేషను దాటి పోతుంది. ఆ బస్సు తప్పిన వాళ్ళంతా సంఘంలో బోసి కొయ్యల్లా మిగిలిపోతారు' అంటూ క్లాసులో చెప్పే నీతి పాఠంలా గుక్కతిప్పకోకుండా చెప్పేశాను.

శారద ముఖంలోని మార్పు ఆమె చేసిన పొరబాటును గుర్తుకు తెచ్చినట్లు నా కనిపించింది.

'అవును మాష్టారూ ! మీరు చెప్పింది అక్షరాలా నిజం. అలా ఆలోచించి నేనొక నిర్ణయానికొచ్చాను. మా కాలేజీ ఇంగ్లీషు లెక్చరర్ రవిని పెళ్ళి చేసుకోవా లనుకొన్నాను. ఆయన ఒప్పుకొన్నారు. మా నాన్నగారు సరేనన్నారు. కానీ ... ' అంది శారద.

'ఇంకా కానీ ఏమిటమ్మా. శుభస్య శీఘ్రమ్' అన్నాను.

'నేను చెప్పేది సాంతం వినండి' అంటూ పర్సులోంచి కాగితం తీసి నా చేతిలోపెట్టి చదవమంది.

కళ్లజోడును సరిచేసుకొని కాగితం తెరిచాను.

'ప్రియమైన శారదకు,

విమల నమస్కారాలు. మీరు రవికి కాబోయే శ్రీమతి. అతణ్ణే నమ్ముకొని సర్వస్వాన్ని అర్పించు కొన్న ప్రియురాలిని నేను. మేమిరువురం ప్రేమించుకొన్నాం. పెళ్ళి చేసుకోవాలనుకొన్నాం. ఎం ఏ. ప్యాసయి నాలుగేళ్ళయినా నాకురాని ఉద్యోగం మామధ్య దూరాన్ని పెంచింది. నన్ను కాదని మీ సంపాదనను చూసి మిమ్మల్ని పెళ్ళి చేసుకోవా లనుకొన్నాడు రవి. సాటి స్త్రీ ప్రేమను గౌరవిస్తా వనే ఆశతో ఈ వుత్తరం వ్రాస్తున్నాను. పూర్వా పరాలు నిర్ణయించే బాధ్యతమీదే ... ఇట్లు

మీ విధేయురాలు

విమల

ఉత్తరం చదివేశాను.

'మరో స్త్రీ జీవితంలో నిప్పులుపోసి నేను సుఖించాలని లేదు. అందుకే దిక్కుతోచక మీ సలహా కోసం ఇలా వచ్చేశాను' అంది శారద.

ఆమె చేస్తున్నది తప్పని, రవిని పెళ్ళి చేసు కొమ్మని ఆదర్శాలు బోధించిన ఉపాధ్యాయుడుగా చెప్పలేకపోయాను.

'రవి శారదనుకాక, సంపాదించే మరో స్త్రీని పెళ్ళాడితే అప్పుడు శారద విమలకు న్యాయం చేయ గలదా' అన్న ఆలోచనా మనసులో మెదిలినా చెప్ప డానికి నోరు రాలేదు.

'మాష్టారూ ! నేను రవిని పెళ్ళి చేసుకొంటే నా ఆదర్శాలకే దెబ్బ. మీరు చెప్పినట్లు ఎవర్నో ఒకరిని నేను వెంటనే పెళ్ళి చేసేసుకొంటాను. ఎవరైనా మంచి సంబంధాలుంటే చూడండి' అంది శారద.

'అవేం మాటలు శారదా, నీకు ఎవర్నో ఒకర్ని పెళ్ళి చేసుకోవాల్సిన గతేంపట్టింది. బంగారంలాంటి చదువుంది. నిక్షేపంలాంటి వుద్యోగముంది. అన్నట్టు నా స్టూడెంటు ఒకడు యూనివర్శిటీలో లెక్చరర్‌గా వున్నాడు. ఈ మధ్యనే డాక్టరేట్ పుచ్చుకొన్నాడు. నీవు సరేనంటే మా ఇంట్లోనే రేపే పెళ్ళిచూపులకు ఏర్పాటు చేస్తాను.''

శారద సరేనంది.

మరునాడు అబ్బాయి వచ్చాడు. శారదను చూశాడు. పెళ్ళికూతురిలా శారదను ముస్తాబు చేసిన మా అమ్మాయి కమలకు థాంక్స్ చెప్పాను.

శిష్యురాలి పెళ్ళి చేతులమీదుగా జరిపించే అదృష్టం కొందరి ఉపాధ్యాయులకే దక్కుతుంది.

అబ్బాయికి శారద నచ్చే వుంటుంది. ఆమె వుద్యోగంకూడా నచ్చేవుంటుంది.

నాకు అప్పుడే అబ్బాయి నిర్ణయం అడగాలనిపించ లేదు. సాయంకాలం తిన్నగా అబ్బాయి ఇంటికెళ్ళాను.

సోఫాలో కూర్చుని వారపత్రిక తిరగేస్తున్న అబ్బాయి నాకేసి చూశాడు.

'రండి మాష్టారూ కూర్చోండి' అంటూ కుర్చీ చూపించాడు. మాటాడేతీరు చూస్తే శారద అబ్బాయికి నచ్చిందనుకొన్నాను.

'ఏమంటావు బాబూ' అడిగాను.

'శారద చదువు— సంస్కారం— వుద్యోగం అన్నీ నాకు నచ్చాయి. పేరు ప్రతిష్టలు గల వాళ్ళ సంబంధం నాకు మరీ నచ్చింది. కాని వయసులోని పొంగు, కళ్ళలోని కాంతి ఆమెలో లేవు. ఆవిడ వుద్యోగంచేసి ఆర్థికంగా తోడ్పడాల్సిన అవసరం నాకు లేదు. నేను కోరుకొనేది ఈడూ—జోడూ నాకు శారదకంటే మీ అమ్మాయి బాగా నచ్చింది. మీకు అభ్యంతరం లేకపోతే మీ అమ్మాయిని పెళ్ళి చేసుకొంటాను'.

ఈ హఠాత్పరిణామానికి నేను మాట్లాడలేక పోయాను.

స్వార్థం నాలో చోటు చేసుకుంది.

నేను అవకాశాన్ని జారవిడుచుకోలేదు. మా అమ్మాయి పెళ్ళి జరిపించేశాను.

శారదకా అవకాశం మళ్ళీ రాలేదు. సంఘంలో బోసికొయ్యలా మిగిలిపోయింది. ★